సాక్షి ఖమ్మం

సోమవారం । 26 । మే । 2025



బార్లు.. బార్లా..

ఎక్సైజ్ శాఖ నిబంధనలకు విరుద్ధంగా జిల్లాలోని పలు ప్రాంతాల్లో బార్లు తెల్లవార్లూ తెరిచే ఉంచుతూ మద్యం విక్రయిస్తున్నారు. 8లో



వైరాకు మహర్దశ

వైరా పట్టణ రూపురేఖలు మార్చేందుకు రూ.100 కోట్ల నిధులతో ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. 8లో

గరిష్టం / కనిష్టం 34° / 26°

వాతావరణం

జిల్లాలో సోమవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. సాయంత్రం ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా జల్లులు పడొచ్చు.

న్యూస్‌రీల్

వైభవంగా వేంకటేశ్వరస్వామి తిరునక్షత్ర వేడుకలు



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

ఏన్కూరు: మండలంలోని నాచారం–రేపల్లెవాడ గ్రామాల మధ్య స్వయంభూగా వెలసిన అద్భుత వేంకటేశ్వర స్వామివారి 23వ తిరునక్షత్ర వేడుకలు ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. సుప్రభాత సేవ, పుణ్యావాచనం, రక్షాబంధనం, 108 కలశాలతో అభిషేకం, మూలమంత్ర హోమం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. అర్చకులు నల్లాన్‌చక్రవర్తుల శ్రీనివాసాచార్యులు, సత్యనారాయణాచార్యులు, తిరుమల సత్యనారాయణాచార్యులు ప్రత్యేక పూజలు చేయగా ఆలయ నిర్మాణ దాత మొగిలి శ్రీనివాసరెడ్డి దంపతులు, వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు హాజరయ్యారు.

ముగిసిన డీడీఎన్ దరఖాస్తు గడువు

- ఉమ్మడి జిల్లాలో 210 ఆలయాల నుంచి దరఖాస్తులు

ఖమ్మంగాంధీచౌక్: దేవాలయాల నిర్వహణ కోసం రూపొందించిన ధూప దీప నివేదన(డీడీఎన్) పథకం దరఖాస్తుల స్వీకరణ గడువు శనివారంతో ముగిసింది. ఈనెల 1న రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ జారీ చేసిన నోటిఫికేషన్ ఆధారంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 210 ఆలయాల నుంచి దరఖాస్తులు అందాయి. ఇందులో ఖమ్మం జిల్లా నుంచి 145, భద్రాద్రికొత్తగూడెం జిల్లా నుంచి 65 దరఖాస్తులు ఉండగా, అధికారులు పరిశీలనప్రారంభించారు. కనీసం 15ఏళ్ల చరిత్ర కలిగి, దేవాదాయ శాఖలో రిజిస్టర్ అయిన ఆలయాల దరఖాస్తులను పరిగణనలోకి తీసుకుని పరిశీలిస్తుండగా, అర్హత ఉన్న వాటి దరఖాస్తులను రాష్ట్ర కమిషనర్‌కు నివేదికను పంపిస్తారు. ఆతర్వాత ఆలయాలకు పడితరం(ధూప దీప నివేదన) కింద రూ.4 వేలు, అర్చకుల గౌరవ వేతనంగా రూ.6 వేలు అందిస్తారు. 2007లో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి ప్రారంభించిన ఈ పథకం ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో 450 దేవాలయాలకు అమలవుతోంది.

నేటి నుంచి శిక్షణ

ఖమ్మం సహకారనగర్ : జిల్లాలో మీ సేవా కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకున్న 647 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లకు సోమవారం నుంచి జూలై 26వ తేదీ వరకు (పనిదినాల్లో) 50రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నారు. టీటీడీసీలో 217 మందికి, ఎస్ఆర్అండ్ బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో 215 మందికి, ప్రభుత్వ పీజీ కళాశాలలో 215 మందికి శిక్షణ ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ మేరకు దరఖాస్తుదారులకు సమాచారం అందించామని పేర్కొన్నారు. 21 మంది సర్వేయర్లతో పాటు ఆరుగురు రిటైర్డ్ సర్వేయర్లతో శిక్షణ ఇప్పించనున్నట్లు వివరించారు. దరఖాస్తుదారులు తమకు కేటాయించిన శిక్షణ కేంద్రానికి వచ్చే సమయంలో ఒరిజనల్ సర్టిఫికెట్లతో పాటు మరొక సెట్ జిరాక్స్ కాపీలను తీసుకురావాలని సూచించారు.

రామయ్యకు సువర్ణ పుష్పార్చన

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారికి ఆదివారం సువర్ణ పుష్పార్చ నిర్వహించారు. తెల్లవారుజామున స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన చేశారు. అనంతరం బేడా మండపంలో విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశాక.. స్వామివారికి కంకణ., యజ్ఞోపవీతధారణ, అమ్మవారికి కంకణ., యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ వేడుకను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

‘సాగు’తున్నారు...



తనికెళ్ల సమీపాన మిర్చి మొక్కలు ట్రాక్టర్‌తో తొలగిస్తున్న రైతు



పొలంలో పొరకలు ఏరుతున్న రైతులు



వైరా వద్ద ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతూ...

రెండు, మూడు రోజులుగా జిల్లాలో కురుస్తున్న వర్షాలతో రైతులు సాగు పనులు మొదలుపెట్టారు. వర్షాలతో భూమి పదును కావడంతో ట్రాక్టర్లతో దుక్కులు దున్నుతూ చదును చేస్తున్నారు. అలాగే, పొరకలను ఏరి ఒకచోట కుప్పపోస్తున్నారు. ఎక్కడ చూసినా భూమిని సాగుకు అనుకూలంగా మార్చడంలో నిమగ్నమైన రైతులే కనిపిస్తున్నారు. ఈసారి నైరుతి రుతు పవనాలు కూడా త్వరగా వస్తాయనే సూచనలతో భూమిని సిద్ధం చేస్తూనే విత్తనాలు సమకూర్చుకుంటున్నారు.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్

బొప్పాయి.. మేలోయి



బొప్పాయి తోట



ఖమ్మం సమీకృత మార్కెట్‌లో అమ్ముతున్న బొప్పాయి పండ్లు

పంట సాగుతో పెట్టుబడికి రెట్టింపు ఆదాయం

- ఉమ్మడి జిల్లాలో 2 వేల ఎకరాల్లో సాగు
- ఎకరాకు 25 టన్నుల వరకు దిగుబడి
- రూ. 20 వేల వరకు పలుకుతున్న టన్ను ధర

ఖమ్మంవ్యవసాయం: అధిక ఆదాయాన్ని ఇచ్చే ఉద్యాన పంటల్లో బొప్పాయి ఒకటి. ఇతర ఉద్యాన పంటలతో పోలిస్తే ఇది తక్కువ కాలపు పంట. మొక్క వేసిన తొమ్మిది నెలల్లో ఉత్పత్తి ప్రారంభమవుతుంది. తోటలకు నాలుగేళ్ల పాటు అవకాశం ఉన్నా ఏడాదిన్నర నుంచి రెండేళ్ల వరకే దిగుబడి పొందుతూ ఆ తర్వాత తొలగిస్తున్నారు. మార్కెట్‌లో బొప్పాయికి డిమాండ్ పెరగడంతో రైతులు ఈ పంట సాగుకు మొగ్గు చూపుతున్నారు. బొప్పాయితో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. జ్వరం, ఇతర వ్యాధులు సోకినప్పుడు బొప్పాయి పండు తినాలని వైద్యులు సూచిస్తున్నారు. ఇది జీర్ణ వ్యవస్థను కూడా మెరుగు పరుస్తుంది. చర్మం, కంటి ఆరోగ్యానికి మేలు చేస్తుంది. వివిధ రకాల విటమిన్లు, పోషకాలను ఇస్తుండగా దీనికి డిమాండ్ పెరిగింది. ఈ పంట సాగు పెరిగినప్పటికీ.. దీనికి కూడా ప్రకృతి వైపరీత్యాల సమస్య ఉంది. ఈదురుగాలులు వచ్చినప్పుడు దెబ్బతినే ప్రమాదం ఉంది.

2 వేల ఎకరాల్లో సాగు..

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 2 వేల ఎకరాల్లో బొప్పాయిని రైతులు సాగు చేస్తున్నారు. జిల్లాలోని రఘునాథపాలెం, ఖమ్మం అర్బన్, కామేపల్లి, కూసుమంచి, తిరుమలాయపాలెం, ఖమ్మం రూరల్, బోనకల్, చింతకాని, ముదిగొండ, మధిర, వైరా, ఏన్కూరు, తల్లాడ తదితర మండలాల్లో 1,700 ఎకరాల్లో ఈ పంట సాగు చేస్తుండగా, భద్రాద్రి జిల్లాలోని జూలూరుపాడు, సుజాతనగర్, ఇల్లెందు, టేకులపల్లి, బూర్గంపాడు, దమ్మపేట, అన్నపురెడ్డిపల్లి తదితర మండలాల్లో 300 ఎకరాల్లో సాగులో ఉంది.

ఖర్చుకు డబుల్ ఆదాయం..

బొప్పాయి సాగు పెట్టుబడి ఎకరాకు రూ.లక్ష వరకు ఖర్చవుతుంది. మొక్కలు, డ్రిప్, మల్చింగ్, దుక్కులు చేయడం తదితర ఖర్చులుంటాయి. అయితే ప్రభుత్వం ఈ పంట సాగుకు ప్రోత్సాహకంగా ఎకరాకు రెండేళ్ల కాలానికి రూ. 27వేల వరకు ఇస్తుంది. ఇక ఎకరాకు ఆదాయం రూ.2 లక్షలకు పైగా వస్తుంది. ఉమ్మడి జిల్లాలో సాగు చేసే బొప్పాయి ఎకరాకు 25 టన్నుల వరకు దిగుబడి వస్తోంది. పంట వేసిన 9 నెలల నుంచి ఉత్పత్తి ప్రారంభం అవుతూ ప్రతీ 15 రోజులకు ఒకసారి చేతికందుతుంది. మొదటి 8 కోతల కాయ బాగా నాణ్యంగా ఉంటుంది. ఆ తర్వాత కొంతమేరకు నాణ్యతతో పాటు సైజ్ కూడా తగ్గుతాయి. 20 నుంచి 22 టన్నుల వరకు నాణ్యమైన, 3 నుంచి 5 టన్నులు కొంత తక్కువ నాణ్యత గల కాయలు దిగుబడి అవుతాయి.

టన్ను రూ.20 వేలు..

బొప్పాయి టన్ను ధర రూ.20 వేల వరకు పలుకుతుంది. ఢిల్లీ, కోల్‌కతా, ముంబయి ప్రాంతాల వ్యాపారులు ఇక్కడి తోటలను పరిశీలించి కాయ సైజు, నాణ్యత ఆధారంగా ధర నిర్ణయిస్తారు. మొదటి కోత టన్నుకు రూ. 18 వేల నుంచి రూ. 20 వేల వరకు, చివరి కోత రూ.10 వేల వరకు పెడుతున్నారు.

ఆదాయపు పంట బొప్పాయి



బొప్పాయి ఆదాయపు పంట. పదేళ్లుగా ఈ పంట సాగు చేస్తున్నా. రెండెకరాల్లో సాగు చేస్తే 50 టన్నుల దిగుబడి వస్తోంది. టన్ను రూ. 13 వేల నుంచి రూ.20 వేల వరకు విక్రయిస్తున్నా. ఇతర పంటలతో పోలిస్తే బొప్పాయి సాగు లాభదాయకం. రంజాన్ వంటి కాలాల్లో బొప్పాయికి బాగా డిమాండ్ ఉంటుంది. హైదరాబాద్ వంటి ప్రాంతాల్లో టన్ను రూ. 40 వేల వరకు కూడా పలుకుతుంది.

– నల్లమోతు వెంకటేశ్వర్లు, బూడిదంపాడు

18 ఎకరాలల్లో సాగు చేస్తున్నా..



18 ఎకరాల్లో బొప్పాయి సాగు చేస్తున్నా. కౌలుతో కలిపి 18 ఎకరాలకు రూ. 25 లక్షల వరకు పెట్టుబడి పెట్టా. ఎకరాకు 25 టన్నుల వరకు దిగుబడి వచ్చింది. రూ. 50 లక్షలకు పైగా ఆదాయం వచ్చింది. ప్రతి రెండేళ్లకు ఒకసారి బొప్పాయిని తొలగించి నూతనంగా పంట సాగు చేస్తా. ఉద్యాన పంటల్లో బొప్పాయి నుంచి ఆదాయం బాగుంటుంది.

– యారం లక్ష్మీరెడ్డి, లక్ష్మీపురం, బూర్గంపాడు మండలం

బొప్పాయి విస్తీర్ణం పెరుగుతోంది



బొప్పాయి సాగుకు రైతులు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఏటేటా సాగు విస్తీర్ణం గణనీయంగా పెరుగుతోంది. బొప్పాయి పంటకు మార్కెట్‌లో ధర పలుకుతుండగా రైతులు సాగుకు మొగ్గు చూపుతున్నారు. ఇక ప్రభుత్వం కూడా ఈ పంట సాగుకు ప్రోత్సాహకాలు అందిస్తోంది. పంట సాగుపై రైతుల్లో అవగాహన పెరిగింది. ఇది లాభదాయకమైన పంటగా గుర్తింపు పొందుతోంది.

– జి.నగేష్, ఉద్యానాధికారి, ఖమ్మం డివిజన్

తిరంగా యాత్రలో శిల్పారెడ్డి తదితరులు



దేశం జోలికొస్తే సత్తా చూపిస్తాం

బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పారెడ్డి

ఖమ్మం మామిళ్లగూడెం : దేశం జోలికొస్తే నారీమణుల సత్తా చూపిస్తామని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పారెడ్డి అన్నారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన సందర్భంగా ఆదివారం ఖమ్మంలో తిరంగా యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పహల్గాం ఘటనకు పాల్పడిన ఉగ్రవాదులకు ప్రధాని నరేంద్ర మోడీ తగిన గుణపాఠం చెప్పారని అన్నారు. ఇకపై దేశం జోలికొస్తే చావు తప్పదనేలా ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడం హర్షణీయమన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు మాట్లాడుతూ 26 మందిని పొట్టనబెట్టుకున్న ఉగ్రవాదులకు ఆర్మీ అధికారులు తగిన శాస్తి చేశారని చెప్పారు. ఇకపై దేశం జోలికి రావాలంటేనే వణికిపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. వైరాలో సోమవారం జరిగే తిరంగా యాత్రకు ప్రజలు అధిక సంఖ్యలో హాజరై జవాన్లకు మద్దతు తెలపాలని కోరారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కన్వీనర్ సన్నే ఉదయ్‌ప్రతాప్, నాయకులు బండారు నరేష్, నకరికంటి వీరభద్రం, విజయారెడ్డి, దొడ్డా అరుణ, పమ్మి అనిత, నీరుకొండ ఉషారాణి, శ్రీరామనేని మణి, మంద సరస్వతి, రజనీరెడ్డి, సురేఖ, కనగంటి నాగమణి, దార్ల మల్లేశ్వరి, శిరీష పాల్గొన్నారు.

శివాలయంలో సమాచార కమిషనర్ పూజలు

కూసుమంచి : కూసుమంచిలోని గణపేశ్వరాలయంలో ఆదివారం రాష్ట్ర సమాచార కమిషనర్ పి.వి. శ్రీనివాస్ సతీ సమేతంగా పూజలు నిర్వహించారు. వారికి అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అర్చకులు శేషగిరి శర్మ ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయ కమిటీ తరఫున జ్ఞాపిక అందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కరుణశ్రీ, ఎస్సై నాగరాజు, ఆలయ చైర్మన్ రేలా ప్రదీప్‌రెడ్డి, ఈఓ కాముని శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



ధ్వజస్తంభం వద్ద పూజలు నిర్వహిస్తున్న కమిషనర్ దంపతులు

ప్రశాంతంగా జీపీఓ పరీక్ష

ఖమ్మం సహకారనగర్: గ్రామ పాలనాధికారుల(జీపీఏ) పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. ఖమ్మం నగరంలోని ఎస్‌బీఐటీ కళాశాలలో నిర్వహించిన పరీక్షకు 255మందికి గాను 225మంది అభ్యర్థులు హాజరు కాగా, 30మంది గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. పరీక్ష కేంద్రాన్ని డీఆర్వో పద్మశ్రీ సందర్శించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ అరుణ, రెవెన్యూ సిబ్బంది శ్రవణ్, సీపీఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఫార్మర్ ఐడీలో కొనసాగుతున్న అగ్రస్థానం

76,705 మంది రైతుల నమోదు, 58,993 మందికి కార్డులు

ఖమ్మంవ్యవసాయం: రైతు గుర్తింపు(ఫార్మర్ ఐడీ) నమోదులో జిల్లా అగ్రస్థానాన కొనసాగుతోంది. ఈనెల 5నుంచి జూన్ 5వరకు నెల పాటు నమోదు చేయనుండగా, ప్రతీ వారం జిల్లాల వారీగా ప్రగతిని వెల్లడిస్తున్నారు. వ్యవసాయ రంగాన్ని డిజిటలైజేషన్ చేయటంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఫార్మర్ ఐడీ ప్రాజెక్టు చేపట్టింది. ఇందులో భాగంగా రాష్ట్రంలోని 32 జిల్లాల్లో 74,93,527 మంది రైతులకు గాను 6,51,751 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఖమ్మం జిల్లాలో మొత్తం 3,40,072 మందికి శనివారం(ఈనెల 24వ తేదీ) వరకు 76,705 మంది రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోగా, 58,993 మంది ఐడీ కార్డులు కూడా జనరేట్ చేశారు. ఈ నేపథ్యాన జిల్లా గత వారం, ఈ వారం కూడా రాష్ట్రంలోనే అగ్రస్థానాన కొనసాగుతోంది. ఇక రెండు నుంచి ఐదో స్థానం వరకు రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, కామారెడ్డి, నిజామాబాద్ నిలిచాయి. అలాగే, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా 17వ స్థానంలో నిలవగా, చివరి స్థానంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కొనసాగుతోంది. వ్యవసాయ విస్తరణాధికారులు, వ్యవసాయాధికారుల కృషికి తోడు రైతుల్లో అవగాహన పెరగడంతో ఫార్మర్ ఐడీలో జిల్లా అగ్రస్థానాన కొనసాగుతోందని జిల్లా వ్యవసాయాధికారి ధనసరి పుల్లయ్య తెలిపారు. ఇంకా మిగిలిన రైతులు సైతం పాస్ పుస్తకాలు, ఆధార్ కార్డుల వివరాలతో ఏఈఓలను సంప్రదించాలని, లేదా మీ సేవా కేంద్రాల్లోనూ నమోదు చేసుకోవచ్చని డీఏఓ వెల్లడించారు.

వృత్యంతర శిక్షణతో అనేక ఉపయోగాలు

ఖమ్మంరూరల్: వేసవి సెలవుల్లో ఇస్తున్న వృత్యంతర శిక్షణతో ఉపాధ్యాయులకు అనేక ఉపయోగాలు ఉన్నాయని డీఈఓ ఎస్.సత్యనారాయణ అన్నారు. మండలంలోని జలగంనగర్ ఉన్నత పాఠశాలలో ఐదురోజులుగా ఇస్తున్న శిక్షణ ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. ఈ శిక్షణతో ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ స్కూళ్లలో నాణ్యమై బోధన అందుతుందని తెలిపారు. ఇక్కడ నేర్చుకున్న అంశాలను తరగతి గదిలో బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థిని పి.వెన్నెల పదో తరగతి ఫలితాల్లో జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచిందని, ప్రైవేట్ పాఠశాలల కంటే సర్కారు స్కూళ్లలో మెరుగైన బోధన అందుతుందనడానికి ఇదే నిదర్శనమని అన్నారు. అనంతరం వెన్నెలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏదులాపురం మున్సిపల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాసరెడ్డి, ఏఎంఓ రవికుమార్, ఎంఈఓ శ్రీనివాస్, విజయలక్ష్మి, శ్యాంసన్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినిని సత్కరిస్తున్న డీఈఓ, మున్సిపల్ కమిషనర్

మొక్కలతో ఉపాధి

ఎస్‌హెచ్‌జీ సభ్యుల కోసం ‘ఉమెన్ ఫర్ ట్రీస్’ పథకం

- జిల్లాలో కేఎంసీతో పాటు మూడు మున్సిపాలిటీల ఎంపిక
- మొక్కలు నాటి.. పెంచే బాధ్యత సంఘ సభ్యులదే
- కేఎంసీలో 7,500 మొక్కలు నాటాలని లక్ష్యం



వైరాలో ఎంపిక చేసిన మహిళలకు అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ వేణు

ఖమ్మంమయూరిసెంటర్: మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వాలు పలు పథకాలను రూపొందిస్తున్నాయి. వారు ఆర్థికంగా ఎదిగితే.. కుటుంబాలు అభివృద్ధి చెందుతాయనే ఉద్దేశంతో ప్రతీ పథకాన్ని మహిళలను దృష్టిలో ఉంచుకుని రూపొందిస్తున్నాయి. ముఖ్యంగా స్వయం సహాయక సంఘాల సభ్యులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కీలక నిర్ణయాలు తీసుకుంటున్నాయి. తాజాగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మొక్కల పెంపకం బాధ్యతను మహిళా సంఘాల సభ్యులకు అప్పగిస్తూ నిర్ణయం తీసుకున్నాయి. కార్పొరేషన్, మున్సిపాలిటీల్లోని చెరువులు, నీటి వనరులు, ఉద్యానవనాల్లో మొక్కల పెంపకం బాధ్యతను స్వయం సహాయ సంఘాలకు అప్పగించే పనులను చేపట్టారు. జిల్లాలోని ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు మధిర, వైరా, సత్తుపల్లి మున్సిపాలిటీల్లో ఈ పథకాన్ని అమలు చేసేందుకు కార్యాచరణ పూర్తి చేశారు. ఉమెన్ ఫర్ ట్రీస్ పథకంలో భాగంగా మొక్కలు నాటే ప్రదేశాలను, పెంపకానికి ఆసక్తి గల మహిళా సంఘాలను మెప్మా అధికారులు ఎంపిక చేశారు.

➡ ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ : నాలుగు ఎస్‌హెచ్‌జీలకు సంబంధించి 34 మంది మహిళా సభ్యులతో పాటు నాలుగు ప్రదేశాలను ఎంపిక చేశారు. ఖమ్మంలోని డంపింగ్‌యార్డ్, ఎన్ఎస్‌పీ క్యాంప్ ఫ్రీడం పార్క్, ట్యాంక్ బండ్, ఊరచెరువు ప్రాంతాల్లో మొక్కలు నాటనున్నారు. డంపింగ్‌యార్డ్‌లో 6 వేలు, ఫ్రీడం పార్క్‌లో 500, ట్యాంక్ బండ్, ఊరచెరువు ప్రాంతాల్లో కలిపి వెయ్యి మొక్కలు నాటనున్నారు.

➡ మధిర : రెండు సంఘాల్లోని 12 మంది మహిళా సభ్యులను ఎంపిక చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని అంబారుపేట చెరువు ఈస్ట్, వెస్ట్ ప్రాంతాల్లో వెయ్యి మొక్కలు నాటనున్నారు.

➡ వైరా : మున్సిపాలిటీలో రెండు సంఘాలకు సంబంధించి 12 మంది సభ్యుల ఎంపిక పూర్తయింది. సోమవరం చెరువు కట్ట ఈస్ట్, వెస్ట్ ప్రాంతాల్లో 3 వేల మొక్కలు నాటేలా ప్రణాళికలు చేశారు.

➡ సత్తుపల్లి : మున్సిపాలిటీ పరిధిలో ఒక సంఘానికి చెందిన 10 మంది సభ్యులను ఎంపిక చేశారు. వేశ్యకాంత చెరువు కట్టపై 500 మొక్కలు నాటనున్నారు.

రెండేళ్ల పాటు నిర్వహణ

ఉమెన్ ఫర్ ట్రీస్ పథకం కింద మహిళా సంఘాల సభ్యులు జూన్ 5 నుంచి పూర్తి స్థాయిలో మొక్కలు నాటనున్నారు. నాటిన మొక్కలను సంరక్షించే బాధ్యత కూడా వారికే అప్పగిస్తున్నారు. మొక్క నాటిన రోజు నుంచి రెండేళ్ల పాటు పూర్తి బాధ్యత వారిదే. ఈ విధానంతో నాటిన ప్రతీ మొక్కను బతికించుకోవచ్చని, మహిళలకు బాధ్యతలు అప్పగిస్తే పారదర్శకంగా నిర్వహిస్తారని ప్రభుత్వాలు భావిస్తున్నాయి. ఈ రెండేళ్ల పాటు అయ్యే ఖర్చులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా సభ్యులకు ఇవ్వనున్నాయి. అమృత్ 2.0 కింద ఈ నిధులను మంజూరు చేయనున్నారు. ఒక్కో మున్సిపాలిటీలో రూ.2 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు మొక్కల పెంపకం, సంరక్షణ కోసం ఖర్చు చేస్తారు. రూ.10 లక్షలు ఖర్చయితే వాటిలో రూ.5 లక్షలు మొక్కల కొనుగోలుకు, మరో రూ.5 లక్షలు రెండేళ్ల పాటు సంఘ సభ్యులకు వేతనాల కింద చెల్లిస్తారు. దీంతో ఒక్కో మహిళకు నెలకు రూ.3 నుంచి రూ.5వేల వరకు గౌరవ వేతనం అందనున్నట్లు తెలుస్తోంది. రోజుకు రెండు గంటల పాటు మొక్కల సంరక్షణకు మహిళలు సమయం కేటాయించాల్సి ఉంటుంది.

ప్రత్యేక కిట్ల పంపిణీ

మొక్కలు నాటి సంరక్షించే బాధ్యత తీసుకుంటున్న మహిళలకు మెప్మా అధికారులు ప్రత్యేక కిట్లు అందజేస్తున్నారు. క్లాత్ సంచితో కూడిన కిట్‌లో ఒక చీర, టోపీ, నోట్‌బుక్, మంచినీటి బాటిల్, పెన్ ఉంటాయి. ఇప్పటికే నగరంలోని పలు సంఘాల సభ్యులకు ఈ కిట్లను అందజేశారు. జిల్లాలోని ఇతర మున్సిపాలిటీల్లోని సభ్యులకు కూడా అందించేందుకు చర్యలు చేపట్టారు.

క్లుప్తంగా

ఇల్లెందువాసికి డాక్టరేట్

ఇల్లెందు: ఇల్లెందు కరెంటాఫీస్ ఏరియాకు చెందిన షేక్ రజియాకు ఉస్మానియా యూనివర్సిటీ నుంచి భౌతికశాస్త్రం విభాగంలో డాక్టరేట్ లభించింది. ఆదివారం రజియా వివరాలు వెల్లడించారు. ఫిజిక్స్ ప్రొఫెసర్ కరుణసాగర్ నేతృత్వంలో సమర్పించిన పరిశోధనాత్మక గ్రంథానికి డాక్టరేట్ లభించిందని తెలిపింది. ఆమెకు డాక్టరేట్ రావడంపై పలువురు అభినందనలు తెలిపారు.

తాళం వేసిన రెండిళ్లలో చోరీ



చోరీ జరిగిన ఇంట్లో ఆధారాలు సేకరిస్తున్న ఎస్ఐ

సుజాతనగర్: తాళం వేసిన రెండిళ్లలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన ఘటన మండల కేంద్రంలోని బాలాజీనగర్‌లో ఆదివారం వెలుగుచూసింది. ఎస్ఐ రమాదేవి కథనం మేరకు.. బాలాజీనగర్‌లో కూరపాటి రాజేంద్రప్రసాద్, నాయుడు సతీశ్ వేర్వేరు వీధుల్లో నివాసం ఉంటున్నారు. వీరిద్దరూ ఇళ్లకు తాళం వేసి కుటుంబ సమేతంగా ఊరికి వెళ్లారు. శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తాళాలు పగలగొట్టి ఇళ్లలోకి ప్రవేశించి చోరీకి పాల్పడ్డారు. రాజేంద్రప్రసాద్ ఇంట్లో 4.4 తులాల బంగారపు వస్తువులు, 44 తులాల వెండి, రూ.30 వేల నగదు, సతీశ్ ఇంట్లో 7 తులాల వెండి వస్తువులు, రూ.5 వేల నగదును చోరీ చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, క్లూస్ టీం ఆధారంగా దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అటవీశాఖ సిబ్బందిపై ఫిర్యాదు

దుమ్ముగూడెం: మండలంలోని గడ్డోరగట్ట గ్రామానికి చెందిన పోడు గిరిజనులు అటవీశాఖ సిబ్బందిపై ఆదివారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మండలంలో అటవీశాఖ అధికారులు ఫారెస్ట్ ప్రొటెక్షన్ వాచర్లతో టేకు చెట్లను నరికిస్తుండగా గ్రామస్తులు వెంబడించారు. ఇద్దరు పారిపోగా మరో ఇద్దరు వాచర్లు దొరకడంతో వారిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆదివాసీలకు వ్యతిరేకంగా హైకోర్టులో వ్యతిరేక సాక్ష్యాలను సృష్టించేందుకు అటవీశాఖ చేసిన కుటిల యత్నాలు బెడిసికొట్టాయని పలువురు అంటున్నారు. ఈ ఘటనపై సీఐ అశోక్ మాట్లాడుతూ.. కేసు హైకోర్టులో ఉన్నందున.. ఈ ఘటనపై అటవీశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని పోడుసాగుదారులకు సూచించారు.

యువకుడి ఆత్మహత్య

అశ్వారావుపేటరూరల్: పురుగులమందు తాగి ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్ఐ యయాతి రాజు కథనం ప్రకారం.. మండలంలోని వినాయకపురం గ్రామానికి చెందిన కమ్మ చిచ్చు సుమంత్ (22) కొంతకాలంగా ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఈ నెల 22న ఇంటికి వచ్చి, పురుగులమందు సేవించాడు. కుటుంబీకులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి.. అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. మృతుడి తండ్రి నాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

బార్లు.. బార్లా



తెల్లవారుజామునే తెరిచిన ఖమ్మంలోని ఓ బార్



ఖమ్మంలోని బార్ పక్కన మద్యం సేవిస్తున్న మందుబాబులు

- నిబంధనలకు విరుద్ధంగా తెరిచి ఉంచుతున్న యాజమాన్యాలు
- తెల్లవార్లూ అమ్మకాల కొనసాగింపు
- అయినా పట్టించుకోని ఎక్సైజ్ శాఖ

ఖమ్మంక్రైం: జిల్లాలోని ఖమ్మం నగరంతోపాటు, ఇతర పట్టణాల్లో ఉన్న బార్లు ఏటీఎం సెంటర్లుగా మారిపోయాయి. ఎనీ టైమ్ మందు అన్న తీరుగా తెల్లవార్లు మద్యం విక్రయిస్తున్నారు. జిల్లాలో 42 బార్‌లు ఉండగా అందులో జిల్లా కేంద్రంలోనే 35 కొనసాగుతున్నాయి. ఇందులో చాలాచోట్ల రాత్రింబవళ్లు మందు విక్రయిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

ఎక్సైజ్ నిబంధనలు తూచ్..

ఎక్సైజ్ శాఖ నిర్ణయించిన ప్రకారం బార్‌లు ఉదయం 10 గంటల నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు అమ్మకాలు కొనసాగించే వీలు ఉంది. అయి తే బార్ యజమానులు అసలు బార్లు మూయకుండానే డ్యూటీల వారీగా సిబ్బందిని నియమించుకొని 24 గంటల పాటు నడిపిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. 12 గంటల తర్వాత ముందు షెట్టర్‌లు మూసివేసి వెనుక దారిగుండా బార్‌లో అమ్మకాలు కొనసాగిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.

ఖమ్మం నగరంలో..

నగరంలో ఒకటిరెండు బార్లు తప్ప అన్నింటిలో 24 గంటల పాటు మద్యాన్ని విక్రయిస్తున్నట్లు సమాచారం. కాల్వొడ్డులో రెండు దేవాలయాలకు సమీపంలో ఉండే బార్‌ను రెండు గంటల పాటే అతికష్టం మీద మూస్తున్నారని, తెల్లవారుజామున 4 గంటల నుంచే షెట్టర్‌ను ఒకవైపు తెరిచి విక్రయాలు జరుపుతున్నారని ఆలయాలకు వచ్చే భక్తులు చెబుతున్నారు. స్టేషన్‌రోడ్డులోని ఓ బార్‌లో ఏ సమయంలోనైనా మద్యం దొరుకుతుందని, మద్యం ప్రియుల మధ్య పలుమార్లు గొడవలు జరిగినా పోలీసులు వెళ్లి చెదరగొట్టిన ఘటనలున్నాయని తెలిసింది. నగరం నడిబొడ్డున, పాతబస్టాండ్, రూరల్ ప్రాంతాల్లో ఉన్నబార్లలో సైతం మద్యాన్ని యథేచ్ఛగా విక్రయిస్తున్నట్లు సమాచారం. వైన్స్‌లలో బార్ల స్థాయిలో పర్మిట్ రూమ్‌లను ఏర్పాటు చేసి మద్యా న్ని విక్రయిస్తున్నారని, దాబాల్లో మద్యం విక్రయిస్తున్నట్లు తాము ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఎక్సైజ్, పోలీస్ శాఖ పట్టించుకోవటం లేదని, అందుకే తాము కూడా మామూళ్లు ఇచ్చి విక్రయాలు కొనసాగిస్తున్నామని కొందరు బార్‌షాపుల యజమానులు చెబుతుండటం గమనార్హం.

మామూళ్ల మత్తులో ఎక్సైజ్ శాఖ..

నిబంధనలకు విరుద్ధంగా జిల్లాలో, ముఖ్యంగా ఖమ్మం నగరంలో బార్లు నడుస్తున్నా ఎక్సైజ్ శాఖ నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తోందని, నెలానెలా మామూళ్ల మత్తులో మునిగి తేలుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎక్సైజ్ శాఖ వారే పట్టించుకోనప్పుడు తమకెందుకు రిస్క్ అని, తమకు రా వాల్సిన మామూళ్లు ఇస్తే చాలని ఇతర అధికారులు చెబుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. కాగా, నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయాలు కొనసాగడం వల్ల రోడ్డుమీద వెళ్లే సామాన్య ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఆయా బార్ల ముందు నుంచి వెళ్లడానికి భయపడుతున్నారు. తెల్లవారుజామున ఆలయాలకు వచ్చే మహిళలు బార్ల ముందు నుంచి వెళ్లేందుకు జంకుతున్నారు. వెంటనే ఎక్సైజ్ శాఖ స్పందించి నిబంధనలకు విరుద్ధంగా బార్లను నడుపుతున్నవారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం..

జిల్లాలో, ఖమ్మం నగరంలో ఎక్సైజ్ నిబంధనలకు విరుద్ధంగా నడిపే బార్లపై చర్యలు తీసుకుంటాం. ఎక్సైజ్ సిబ్బందితో స్పెషల్ డ్రైవ్ ఏర్పాటు చేస్తాం. సమయానికి బార్లను మూయకుండా తెల్లవార్లు మద్యం నడిపితే ఆ బార్లను సీజ్ చేసే అవకాశం కూడా ఉంది.

–నాగేందర్‌రెడ్డి, ఎక్సైజ్ సూపరింటెండెంట్

కొనసాగుతున్న ఉపాధ్యాయ శిక్షణ

- సమగ్ర ప్రణాళికతో మొదలవనున్న విద్యా సంవత్సరం
- నేటి నుంచి మూడో విడత శిక్షణ



శిక్షణపై సూచనలిస్తున్న జిల్లా ప్రత్యేక అధికారి విజయలక్ష్మీబాయి (ఫైల్)

ఖమ్మంసహకారనగర్: రాష్ట్ర ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరానికి విద్యార్థులకు సకల సౌకర్యాలతో విద్యను అందించనుంది. వేసవి సెలవుల్లో ఉపాధ్యాయులకు శిక్షణ ఏర్పాటు చేసింది. రిసోర్స్ పర్సన్‌ల కోసం ఆసక్తి గల ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోగా ఇంటర్వ్యూ నిర్వహించి, ఎంపిక చేసి శిక్షణ కోసం హైదరాబాద్ పంపారు. అనంతరం జిల్లాకేంద్రంలో జిల్లాస్థాయి శిక్షణా శిబిరాలు, సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు మండల స్థాయిలో శిక్షణా శిబిరాలు ఏర్పాటు చేశారు. ఈ నెల 13 నుంచి 30 వరకు మూడు విడతల్లో శిక్షణనిస్తున్నారు. రెండు విడతల శిక్షణ పూర్తి కాగా.. మూడో విడత సోమవారం నుంచి ప్రారంభం కానుంది. ఈ శిక్షణలో మొత్తం 5,276 మంది ఉపాధ్యాయులు, హెచ్ఎంలు పాల్గొంటున్నారు.

జిల్లా స్థాయిలో..	
అన్ని సబ్జెక్టుల స్కూల్ అసిస్టెంట్లు	2774
మండల రిసోర్స్ పర్సన్లు	168
గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు	185
స్పెషల్ ఎడ్యుకేటర్స్	32
ఐఈఆర్‌పీలు	30
మొత్తం	3,189
మండల స్థాయిలో....	
ఎస్‌జీటీలు	2087

పకడ్బందీ ఏర్పాట్లు

జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.సత్యనారాయణ కోర్సు డైరెక్టర్‌గా పర్యవేక్షిస్తున్నారు. ఎస్ఐఈటీ డైరెక్టర్ విజయలక్ష్మిబాయిని జిల్లా ప్రత్యేక అధికారిగా నియమించారు. ఆమె పలుమార్లు శిక్షణ ఏర్పాట్లు, శిక్షణ తీరును పరిశీలించటమే కాక ఇతర అంశాలపై సమీక్ష నిర్వహించారు. అన్ని శిక్షణ కేంద్రాల్లో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్‌తో పాటు ఇంటర్నెట్ సౌకర్యం కల్పించారు. ఏఎంఓ కె.రవికుమార్ సమన్వయకర్తగా వ్యవహరిస్తుండగా సీఎంఓ వై.రాజశేఖర్, ప్లానింగ్ కోఆర్డినేటర్ చుంచు రామకృష్ణ సహకరిస్తున్నారు.

వైవిధ్యంగా శిక్షణ

ఉపాధ్యాయులకు ఏయే అంశాల్లో ప్రత్యేక శిక్షణ అవసరమో భావించి నిపుణులను గుర్తించి వారితో శిక్షణ ఇప్పిస్తున్నారు. సైబర్ నేరాలు పెరుగుతున్న దృష్ట్యా పోలీస్ శాఖ సైబర్ క్రైమ్ ఏసీపీ వంశీకళాధర్ ఇతర అధికారులు సైబర్ నేరాలు, మహిళల అక్రమ రవాణా తదితర అంశాల్లో ఉపాధ్యాయులకు శిక్షణ నిచ్చారు. సైకాలజిస్టులు, వైద్య విభాగ నిపుణులు, వివిధ ఎన్జీఓలు, స్వచ్ఛంద కార్యకర్తలు, మోటివేషన్ స్పీకర్లను ఉపాధ్యాయ శిక్షణకు తీసుకొచ్చారు.

లక్ష్యాలను సాధిస్తాం..



ఏటా పడిపోతున్న విద్యార్థుల సంఖ్యను పెంచటం, మరింత నాణ్యమైన విద్యను అందించటం మా లక్ష్యంగా పని చేస్తున్నాం. దీనిలో ఎదురయ్యే సవాళ్లను అధిగమిస్తాం. ఈ నెల ప్రారంభంలో ఉన్నతాధికారులు 3 రోజులపాటు డీఈఓలకు ఇచ్చిన శిక్షణలో ఇదే అంశాలపై స్పష్టమైన ఆదేశాలిచ్చారు. విద్యాభివృద్ధికి ప్రభుత్వం తగిన ప్రణాళికలు, నిధులు ఇచ్చి అన్ని విభాగాల అధికారులతో సమన్వయం చేస్తోంది.

–సామినేని సత్యనారాయణ, డీఈఓ, ఖమ్మం


అమలు చేస్తేనే సార్థకత



జిల్లాస్థాయిలో రెండు విడతలతో పాటు మండలస్థాయి శిక్షణలు విజయవంతంగా నిర్వహించడంలో ఎంఈఓలు, రిసోర్స్ పర్సన్లు, ఉపాధ్యాయుల సేవలు మరువలేనివి. శిక్షణలో నిర్దేశించిన అంశాలు, ప్రక్రియలు, కార్యక్రమాలు, చర్యలను పాఠశాలస్థాయిలో నిబద్ధతతో అమలు చేసినప్పుడు మాత్రమే శిక్షణకు సార్థకత లభిస్తుంది. మన పాఠశాలలకు గౌరవం దక్కుతుంది.

–కె.రవికుమార్, అకడమిక్ మానిటరింగ్ అధికారి, సమగ్ర శిక్ష

వైరాకు మహర్దశ



వైరా పట్టణ వ్యూ

వైరా: వైరా పట్టణ రూపురేఖలు మార్చేందుకు అధికారులు, నాయకులు అడుగులు వేస్తున్నారు. వైరా మండల వాసి, రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆలోచనలకు అనుగుణంగా అభివృద్ధిలో వైరా మున్సిపాలిటీ దూసుకుపోనుందని పలువురు చెబుతున్నారు. వైరా పట్టణంలోని పాత పంచాయతీ కార్యాలయం ఆనుకుని రిజర్వాయర్ ఎస్కేప్ లాకుల వరకు పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ట్యాంక్‌బండ్, అక్కడే బోటింగ్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశాలు అందినట్లు సమాచారం. నిరంతరాయంగా ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా రహదారుల నిర్మాణాన్ని చేపట్టాలని, అందుకు ప్రధానంగా వాసవీ కల్యాణ మండపం నుంచి కేవీసీఎం కళాశాల రహదారి వరకు డివైడర్లతో కూడిన రహదారి నిర్మాణంతో పాటుగా గండగలపాడు గ్రామ సమీపంలో రిజర్వాయర్ కాల్వను ఆనుకుని ఇందిరమ్మ కాలనీ వరకు మరో రహదారి నిర్మాణం చేపట్టనున్నారు.

రూ.100 కోట్లతో అభివృద్ధి పనులు

వైరా మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.100కోట్ల నిధులకోసం ప్రణాళికలు సిద్ధం చేయనున్నారు. శిథిలావస్థకు చేరిన ఎన్నెస్పీ క్వార్టర్లను తొలగించి, ఐటీఐ కళాశాల నిర్మాణం, రూ.10 కోట్ల అంచనా వ్యయంతో డంపింగ్‌యార్డ్ నిర్మించనున్నారు. వైరా రిజర్వాయర్‌కు వెళ్లేందుకు ప్రధాన రహదారి నిర్మాణం, రిజర్వాయర్ ఆనకట్ట సుందరీకరణకు రూ.6.50 కోట్లు, వైరా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి రూ.10కోట్లతో ప్రతిపాదనలు, రూ.85 లక్షల వ్యయంతో సెంట్రల్ లైబ్రరీ ఏర్పాటుకు ప్రతిపాదనలు చేయనున్నారు. అలాగే, రిజర్వాయర్ ఆనకట్ట నిర్మాణం, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం సమీపంలోని ఐబీ గెస్ట్ హౌస్, పాత గ్రామ పంచాయతీ కార్యాలయాలు చారిత్రక ఆనవాళ్లుగా ఉండేలా చూడాలని, రిసార్ట్‌ల నిర్మాణానికి అవసరమైన స్థలాలు గుర్తించాలని అధికారులకు ఆదేశాలు అందాయి.

పాము కాటుతో మహిళ మృతి

కూసుమంచి: మండలంలోని నర్సింహులగూడెం గ్రామానికి చెందిన పెరుమాళ్లపల్లి విజయ (38) పాముకాటుకు గురై మృతి చెందింది. ఈ నెల 22న రాత్రి తన ఇంట్లో ఆమె చాపమీద పడుకోగా పాముకాటు వేయటంతో కుటుంబ సభ్యులు ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ విజయ ఆదివారం మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కాంగ్రెస్ నాయకుడి మృతికి సంతాపం



నివాళులర్పిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి దంపతులు, (ఇన్‌సెట్) బాలరాజు (ఫైల్)

మధిర: మండలంలోని ఆత్కూరు గ్రామానికి చెందిన కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు దారా బాలరాజు (52) గుండెపోటుతో ఆదివారం మృతి చెందారు. ఉదయం వాకింగ్‌కు వెళ్లి వచ్చాక ఛాతిలో నొప్పిగా ఉందని చెప్పడంతో కుమారుడు బైక్‌పై మధిర ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. బాలరాజు మృతి విషయం తెలుసుకున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, సతీమణి నందిని హైదరాబాద్ నుంచి వచ్చి, ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. నివాళులర్పించినవారిలో వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ జెడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌తోపాటురాయల నాగేశ్వరరావు, దొబ్బల సౌజన్య, బండారు నరసింహారావు, సూరంశెట్టి కిశోర్, వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, మిర్యాల రమణగుప్తా, వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



నరేశ్ మృతదేహం

చింతకాని:మండలంలోని నాగులవంచ గ్రామం వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బోనకల్ మండలం మోటమర్రి గ్రామానికి చెందిన వత్సవాయి నరేశ్ (26) మృతి చెందాడు. నరేశ్ ద్విచక్రవాహనంపై ఖమ్మం నుంచి మోటమర్రి వెళ్తుండగా నాగులవంచ పెట్రోల్ బంకు వద్ద రహదారిపై వెళ్తున్న గేదెలను ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన నరేశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ నాగుల్‌మీరా ఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని అన్నం సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకులు శ్రీనివాసరావు సహకారంతో ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడు బోనకల్ గురుకుల పాఠశాలలో కాంట్రాక్ట్ పద్ధతిలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు.

ముంజల కోసం ఆగి మృత్యువాత

రోడ్డు ప్రమాదంలో తల్లీ కుమారుడు మృతి



శారద(ఫైల్)



తండ్రి వెంకటస్వామితో కార్తీక్ (ఫైల్)

రఘునాథపాలెం: తాటి ముంజలు కొనుగోలు చేసేందుకు ఆగగా.. కారు ఢీకొన్న ఘటనలో తల్లీ కుమారుడు మృతి చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. మండల పరిధిలోని బూడిదంపాడు సమీపంలో ఖమ్మం – ఇల్లెందు ప్రధాన రహదారిపై జరిగిన ఈ ప్రమాదంలో మహిళ భర్త కూడా తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. కామేపల్లి మండలం జాస్తిపల్లికి చెందిన బత్తుల వెంకటస్వామి తన భార్య శారద (31), కుమారుడు కార్తీక్ (12)తో కలిసి ఖమ్మం శ్రీనివాసనగర్‌లో బంధువుల ఇంటికి వచ్చాడు. వారు ఉప్పలమ్మ దేవతను పెట్టుకోగా, ఆ వేడుక పూర్తయ్యాక ద్విచక్ర వాహనంపై సాయంత్రం తిరిగి బయలుదేరారు. బూడిదంపాడు సమీపంలోని పవర్ గ్రిడ్ వద్ద తాటి ముంజల కోసం రోడ్డుకు కుడివైపున ఆగారు. కొనుగోలు చేశాక ప్రయాణం ప్రారంభించే సమయంలో ఖమ్మం నుంచి ఇల్లెందు వైపు వేగంగా వెళ్తున్న కారు వీరిని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో శారద, కార్తీక్ తీవ్రంగా గాయపడి ఆస్పత్రికి తరలించేలోపే మృతిచెందగా, వెంకటస్వామికి తీవ్ర గాయాలయ్యాయి. అక్కడ ముంజలు విక్రయిస్తున్న వ్యక్తి కూడా గాయపడ్డాడు. వెంకటస్వామి ప్రస్తుతం ఖమ్మం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వ్యవసాయంపై ఆధార పడి జీవిస్తున్న ఆయన ఖాళీ సమయంలో సుతారి పనులు కూడా చేస్తుంటాడు. బీఆర్ఎస్ మండల బీసీ సెల్ అధ్యక్షుడిగా కూడా కొనసాగుతున్నాడు. ఈ ఘటనపై సీఐ ఉస్మాన్‌షరీఫ్ కేసు నమోదు చేశారు.

ఆస్పత్రికి తరలించి ఆ తర్వాత పరారీ..

రోడ్డు ప్రమాదానికి కారణమైన వ్యక్తి.. తన కారులోనే గాయపడిన ముగ్గురిని ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లాడు. రోడ్డు పక్కన పడి ఉండగా తీసుకొచ్చినట్టు వైద్యులకు చెప్పి, ఆ తర్వాత అక్కడి నుంచి ఉడాయించాడు. కాగా, అప్పటికే శారద, కార్తీక్ మృతిచెందారు. ఆ కారు ఎక్కడిది, ఢీ కొట్టినప్పుడు ఎవరు డ్రైవింగ్ చేస్తున్నారు అనే కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు. భార్య, కుమారుడి మృతి విషయం వెంకటస్వామికి తెలియదని, వారి ఆరోగ్యం ఎలా ఉందంటూ ఆందోళనగా ఆరా తీస్తున్నాడని బంధువులు తెలిపారు. ఇక తల్లి, సోదరుడి మృతితో వెంకటస్వామి ఇద్దరు కూతుర్ల రోదనలు అందరినీ కంటతడి పెట్టించాయి.

బైక్‌ను ఢీకొట్టిన బస్సు.. ఒకరు మృతి

కొణిజర్ల: ద్విచక్రవాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో వ్యక్తి దుర్మరణం పాలైన ఘటన ఆదివారం సాయంత్రం కొణిజర్లలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని పెద్దరాంపురం గ్రామానికి చెందిన ఐనపనూరి నాగేశ్వరరావు అలియాస్ నాగరాజు (33) తన కుమార్తెను ఖమ్మం వైద్యశాలలో చేర్పించి డబ్బుల కోసం ఇంటికి వస్తున్న క్రమంలో బస్వాపురం క్రాస్‌రోడ్డు వద్ద ఖమ్మం వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. నాగేశ్వరరావు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య సుష్మ, ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ సూరజ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

చింతకాని: మండలంలోని వందనం గ్రామవాసి మెట్టుపల్లి వెంకటేశ్వర్లుకు చెందిన పాడి గేదె ఆదివారం విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. మేత కోసం అడవికి వెళ్లిన గేదె విద్యుత్ స్తంభం వద్దకు వెళ్లగా షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. ఈదురుగాలులకు స్తంభంపై ఉన్న వైర్లు కలవడం వల్ల స్తంభానికి విద్యుత్ సరఫరా జరిగి గేదె మృతి చెందినట్లు బాధితుడు తెలిపారు. రూ.70 వేల నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

సేద్యానికి ‘స్వర్ణ’యుగం

తక్కువ ధరకే రోటోవేటర్ యంత్రం తయారీ

- పూరి గుడిసెలో సాగుతున్న కుటీర పరిశ్రమ
- ఆదర్శంగా నిలుస్తున్న యువ మహిళా ఇంజనీర్





సోదరి, తండ్రితో కలిసి కల్టివేటర్ తయారీలో స్వర్ణ (కుడి) (ఇన్‌సెట్) డబుల్ వీల్ కల్టివేటర్ (పవర్ వీడర్)

ఇల్లెందు రూరల్: గతంతో పోలిస్తే వ్యవసాయంలో యాంత్రీకీకరణ పెరిగి రైతులకు పనులు సులువవుతున్నాయి. విత్తనాలు నాటడం నుంచి పంట చేతికందే వరకు అన్నింటికీ యంత్రాలు అందుబాటులోకి వచ్చాయి. అయితే వాటి ధరకు భయపడి సన్న, చిన్నకారు రైతులు ఇంకా కూలీలపైనే ఆధారపడుతున్నారు. ఈ క్రమంలో తక్కువ ధరకే కల్టివేటర్ తయారు చేసి రైతులకు అందుబాటులోకి తీసుకొచ్చింది ఓ యువ ఇంజనీర్.

కుల వృత్తే స్ఫూర్తిగా..

ఇల్లెందు మండలం బొజ్జాయిగూడెం గ్రామానికి చెందిన చిట్టోజి మోహనాచారి కుల వృత్తి అయిన వడ్రంగి పనులతో జీవనం సాగించేవాడు. వ్యవసాయ పనిముట్లు తయారు చేయడం ఆయన ప్రత్యేకత. కుమార్తె స్వర్ణ బీటెక్ పూర్తి చేసింది. చిరుప్రాయం నుంచి తండ్రి చేసే పనులు చూసిన ఆమె.. కరోనా సమయంలో ఇంటి వద్ద తండ్రికి సాయంగా ఉంటూ వ్యవసాయానికి అవసరమయ్యే కల్టివేటర్ తయారీపై దృష్టి సారించింది. మార్కెట్ కంటే తక్కువ ధరతోనే రూపొందించి స్థానిక రైతులకు విక్రయించింది. రైతుల నుంచి ప్రోత్సాహం లభించడంతో నాలుగేళ్లుగా విజయవంతంగా కొనసాగిస్తోంది.

ఇంటివద్దే పూరిగుడిసెలో..

ఆర్థిక పరిస్థితి సహకరించకున్నా.. ప్రారంభంలో అప్పు చేసి కల్టివేటర్(పవర్ వీడర్) తయారీకి అవసరమైన ముడి సరుకును హైదరాబాద్, విజయవాడ నుంచి తెప్పించేది. ఆపై ఇంటి వద్దే తండ్రి, సోదరి రజిత సహకారంతో విజయవంతంగా కల్టివేటర్ తయారీ ప్రారంభించింది. మొదట నెలకు నాలుగైదు యంత్రాలను తయారు చేసి.. క్రమంగా ఆ సంఖ్యను పదికి పెంచింది. మార్కెట్‌లో కల్టివేటర్ ధర రూ.40 వేల నుంచి రూ.45 వేల వరకు ఉండగా.. స్వర్ణ మాత్రం 7హెచ్‌పీ సింగిల్ వీల్ కల్టివేటర్ రూ.26 వేలు, 7హెచ్‌పీ డబుల్ వీల్ కల్టివేటర్ రూ.28 వేలకే విక్రయిస్తోంది. ధర తక్కువైనా బయటి వాటికంటే నాణ్యంగా ఉన్నాయని రైతులు కితాబిస్తుండడం విశేషం.

వినియోగం ఇలా..

ఎరువులు, పురుగు మందులతో పాటు కూలీల రేట్లు కూడా భారీగా పెరగడంతో రైతులకు పెట్టుబడి భారమవుతోంది. ఈ క్రమాన యాంత్రీకరణ విధానం భారం తగ్గిస్తున్నా.. వాటి ధరలు చూసి చాలా మంది వెనకడుగు వేస్తున్నారు. అయితే స్వర్ణ తయారు చేస్తున్న కల్టివేటర్(పవర్ వీడర్లు) ఉద్యాన పంటలు, వాణిజ్య పంటలు సాగు చేసే రైతులకు అండగా నిలుస్తున్నాయి. విత్తనం మొలకత్తే దశలో కలుపు తొలగించడం, మొక్కల వరుస మధ్యలో దున్నడం, ఆ తర్వాత పాదులు చేయడానికి ఇవి ఉపయోగపడుతున్నాయి.

ప్రోత్సహిస్తే మరిన్ని యంత్రాలు



బీటెక్‌లో నేర్చుకున్న పాఠాల ఆధారంగా వ్యవసాయ యాంత్రీకరణపై దృష్టి సారించా. తొలి ప్రయత్నంలో విజయం సాధించా. ఇవి అమ్మితే వస్తున్న ఆదాయం పెట్టుబడి ఖర్చులు పోగా కుటుంబ పోషణకు సరిపోతోంది. యంత్రాల తయారీని విస్తరించే ఆర్థిక స్తోమత లేదు. ప్రభుత్వం సబ్సిడీపై రుణాలు అందిస్తే మరిన్ని వ్యవసాయ యంత్ర పరికరాలు తయారుచేస్తా.

– చిట్టోజి స్వర్ణ